క్లుప్తంగా

బాలకృష్ణ భాష దారుణం


మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాల కృష్ణ అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభా మర్యాదలు పాటించకుండా, సభలో లేని వ్యక్తులపై బాలకృష్ణ అసందర్భంగా, పరుష పదజాలంతో అసభ్యక రంగా మాట్లాడిన తీరు చూసి ప్రజలు ఆయన్ని ఛీకొడుతున్నారని అన్నారు. అయిదేళ్ల పాటు సుపరిపాలన అందించి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన జగన్‌మోహన్‌రెడ్డిపై అసెంబ్లీ సాక్షిగా బాలకృష్ణ ఉపయోగించిన భాష దారుణంగా ఉందన్నారు. బాలకృష్ణ స్థాయి ఏంటో ప్రజలకు అర్థమైందని, తన వ్యక్తిత్వాన్ని మరింత దిగజార్చుకున్నారని అన్నారు.

స్వచ్ఛంద సంస్థల ఔదార్యం


స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన రేకుల షెడ్

వంగర: మండలానికి చెందిన స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ, కొత్తూరుకు చెందిన హోలీక్రాస్ సంస్థ తమ ఔదార్యాన్ని చాటుకున్నాయి. మండలంలోని బంగారువలస గ్రామానికి చెందిన నిరుపేద బోయిన జయమ్మకు ఈ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా రేకుల షెడ్ నిర్మించి అప్పగించారు. జయమ్మ ఇదివరకు నివసించే పూరి గుడిసె వర్షానికి కారిపోతుండడంతో ఇబ్బందులు పడేది. ఈ సమాచారం తెలుసుకున్న స్పందన, హోలీ క్రాస్ సంస్థలు సంయుక్తంగా రూ.50వేలు ఖర్చు చేసి పూరిపాకను తొలగించి ఆ స్థానంలో రేకుల షెడ్ నిర్మించి జయమ్మకు అందజేశారు. నిరుపేదకు స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణకు జయమ్మ కృతజ్ఞతలు తెలపగా, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వంగర: పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని పాలకొండ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఎం.సీతారాంపురం పోస్టాఫీసును బొబ్బిలి పోస్టల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి శనివారం పరిశీలించారు. అప్పటికి పోస్టాఫీసు తెరవకపోవడంతో పోస్ట్‌మాస్టర్ రమణమ్మను మందలించారు. సకాలంలో పోస్టాఫీస్ తెరవాలని, ప్రజలకు సక్రమంగా సేవలందించాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

రాజాం సిటీ: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ సిబ్బంది ముందుండాలని, అలసత్వం తగదని ఎంపీడీఓ జె.ఆనంద రావు అన్నారు. మండలంలోని గురవారం గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కె.దిలీప్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో రైతులు, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై మండల వ్యవసాయ అధికారి(ఏఓ) తట్టికోట కన్నబాబు శనివారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఏ సమాచారమైనా సమాచార హక్కు చట్టం ద్వారా ఎవరైనా తెలుసుకోవచ్చని చెప్పారు. సమాచార హక్కు చట్టం అనేది అన్ని ప్రభుత్వ రంగ సంస్థలకూ వర్తిస్తుందని, పౌరులు అడిగే సమాచారాన్ని తప్పనిసరిగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులు, సంబంధిత శాఖపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, నిధుల మంజూరు, నిధుల చెల్లింపుల గురించి లిఖితపూర్వకంగా తెలుసుకోవచ్చన్నారు. ఈ చట్టాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

బాడంగి: వృత్తి విద్యా కోర్సులను అభ్యసిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు వృత్తివిద్యాకోర్సులపై శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు శనివారం ఇన్‌స్ట్రక్టర్లు వెంకటరమణ, దినేష్, హసీనా రిటైల్,సూపర్ బజార్,సేల్స్, కస్టమర్ రిలేషన్, ఎలక్ట్రానిక్స్, టీవీ,ఫ్యానులు, మిక్సీలు, ఫ్రీజర్లు, ఏసీల రిపేర్లపై శిక్షణ ఇచ్చారు. అలాగే ఐటీ విభాగంలో డిజిటల్ పౌరసేవలు,సచివాలయ పనితీరు ఆన్‌లైన్ అప్లికేషన్లకు సంబంధించి అవగాహన కల్పించారు. విద్యార్థులను మండల కేంద్రంతో పాటు రామభద్రాపురం, బొబ్బిలి ప్రాంతాలకు తీసుకువెళ్లి సూపర్‌బజార్‌లు, ఇతర సంస్థల పనితీరును ప్రత్యక్షంగా చూపించి, వివరించారు.

చతికిలపడ్డ అన్నదాత

- నష్టాలను మిగిల్చిన మొక్కజొన్న సాగు
- సకాలంలో యూరియా వేయకపోవడంతో తగ్గిన దిగుబడి
- కోత దశలో వర్షాలు కురుస్తుండడంతో దెబ్బతిన్న పంట
- లబోదిబోమంటున్న రైతు


సంతకవిటి మండలం సిరిపురం వద్ద చనిపోయిన మొక్కజొన్న చేను


ఎరువు వేయకపోవడంతో తగ్గిపోయిన కండె పరిమాణం

రాజాం: ఎరువుల పంపిణీలో ప్రభుత్వం వైఫల్యం నియోజకవర్గంలో ఖరీఫ్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వ చేతకాని తనం వల్ల రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వ వైఫల్యానికి ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా తోడవ్వడంతో ఈ ఏడాది రైతుకు మొక్కజొన్నసాగు కలిసి రాలేదు. గతేడాది వరకు ఇటు ఖరీఫ్ అటు రబీలో ఈ పంట రైతుకు మంచి లాభాలు తెచ్చి పెట్టింది. పంట దిగుబడి బాగా రావడంతో పాటు గిట్టుబాటు ధర కూడా ఉండడంతో అన్నదాతకు అండగా నిలిచేది. ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్నపై ఆధారపడిన రైతు చతికిలపడ్డాడు. మంచి ఆదాయాన్ని అందిస్తుందని ఆశించిన రైతన్నకు కన్నీటిని మిగిల్చింది.

అదునుకు అందని ఎరువు

మొక్కజొన్న సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. ఎకరా విస్తీర్ణంలో పంటసాగుకు గట్టిగా రూ.8 వేలు పెట్టుబడి పెడితే చాలు.ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. గత వేసవి వరకు మొక్కజొన్న గింజలు క్వింటాల్ ధర రూ. 2,500 ఉండేది. ఇప్పుడు వీటి ధర పతనమయ్యింది. క్వింటాల్ ధర రూ. 2,100 నుంచి రూ. 2,300ల మధ్య పలుకుతోంది. ఇదిలా ఉండగా రబీ వరకు ఈ పంటలో దిగుబడి కనిపించగా, ప్రస్తుతం ఖరీఫ్‌లో దిగుబడి సన్నగిల్లింది. ఇప్పుడు కోత దశలో ఉన్న సమయంలో మొక్కలు చనిపోతున్నాయి. సకాలంలో యూరియా ఎరువు అందించలేకపోవడంతో పంట దెబ్బతిందని, ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే సూచనలు కనిపించడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు. పంటకు పూతసమయంలో ఎకరానికి రెండు పర్యాయాలు 50 కిలోల యూరియా వేయాల్సి ఉందని, యూరియా లభించకపోవడంతో పంటకు వేయలేకపోయామని, ఆ ప్రభావం దిగుబడిపై పడిందని రైతులు అంటున్నారు. గతంలో రైతు సేవా కేంద్రాల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యూరియా, ఇతర ఎరువులు అందించేది. ఇప్పుడు ఈ కేంద్రాల్లో ఎరువులు ఇవ్వకపోగా, ప్రైవేటు డీలర్లు వద్ద కూడా యూరియా లభించకపోవడంతో రైతులు అదునుకు ఎరువులు అందించలేకపోయారు. ఎరువులు వేయలేకపోయినప్పటికీ అంతో ఇంతో చేతికొస్తుందనుకున్న పంట కూడా తాజాగా కురిసిన వర్షాలకు పాడవుతోందని రైతులు అంటున్నారు. వర్షాలకు మొక్క చివికిపోయి చనిపోయిందని, కండెలు పూర్తిగా పాడయ్యాయని రైతులు వాపోతున్నారు.

రాజాం నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు వివరాలు..	
మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
రాజాం	4,600
సంతకవిటి	5,200
వంగర	3,100
రేగిడి	3,700

దిగుబడి తగ్గింది



గతేడాది వరకు మొక్కజొన్న పంట మంచి దిగుబడి రావడంతో పాటు గిట్టుబాటు ధర కూడా ఉండేది. ఇప్పుడు ఆ దిగుబడి లేదు.ఈ ఖరీఫ్ సీజన్‌లో రెండెకరాల్లో మొక్కజొన్న వేశాం. ఎకరానికి 15 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. సకాలంలో యూరియా వేయలేకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. – గేదెల దాలినాయుడు, రైతు, సిరిపురం, సంతకవిటి మండలం

కుళ్లి పోతోంది..



ఈ ఏడాది మొక్కజొన్న సాగులో ఇబ్బందులుఎదురయ్యాయి. నాణ్యమైన విత్తనాలు అందలేదు. సరిపడా ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో లభించలేదు. తాజాగా కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల పంట మొత్తం చివికిపోయింది. రైతులకు నష్టాలు, కష్టాలే మిగిలాయి. – తాడ్డి గోపాలకృష్ణ, రైతు, లక్ష్మీపురం, రాజాం మండలం

ప్రతికూల వాతావరణమే కారణం



నియోజకవర్గంలో అన్నిచోట్లా రైతులకు యూరియా సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు వచ్చాయి. ప్రతికూల వాతావరణం కారణంగానే మొక్కజొన్న పంట దిగుబడి తగ్గింది. – కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

బాలకృష్ణది పైశాచికానందం


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై శాశనసభలో హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేసి పైశాచికానందం పొందారని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మండిపడ్డారు.రాజాంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదికని, అక్కడ ప్రజా సమస్యలు గురించి మాట్లాడాలి, పోరాడాలని, అలా కాకుండా కొంతమంది ఎమ్మెల్యేలు ఒక పార్టీని, ఒక అధినాయకుడిని ఉద్దేశించి పరుష పదజాలంతో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టిలో పడేందుకు దిగజారి వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల బాలకృష్ణ ఇలానే మాట్లాడారని గుర్తుచేశారు. సినిమాలో ఒక డైరెక్టర్ ఏదో చెబితే అది చేసి డైలాగులు చెప్పి, కత్తులు చూపించి ఏదో సాధించినట్లు ఫీలవుతూ..అవి బయట కూడా ప్రదర్శించాలనుకోవడం బాలకృష్ణ అవివేకమని దుయ్యబట్టారు. సినిమా హీరోలవి కేవలం యాక్షన్ మాత్రమేనని, బయట ప్రపంచంలో హీరోలు వేరేగా ఉంటారన్నారు. అటువంటి రియల్ హీరో జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. అధికారంలో లేకపోయినా ఆయన వెంట లక్షలాదిమంది ప్రజలు వస్తున్నారంటే అది ఆయన ఘనత అని, రియల్ లైఫ్‌లో జగన్‌ని హీరోగా ప్రజలు గుర్తించారని వివరించారు. గతంలో ఒక కేసులో మానసిక స్థితి బాగోలేదని, దొంగ సర్టిఫికెట్ పుట్టించి, కేసు నుంచి తప్పించుకున్న బాలకృష్ణ పాత రోజులు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఆరోజు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి తలచుకుంటే బాలకృష్ణ పరిస్థితి వేరే విధంగా ఉండేదన్నారు. వైఎస్సార్ ఉన్నప్పుడు కానీ, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కానీ తప్పుడు ప్రవర్తన, తప్పుడు పదజాలంతో మాట్లాడే వ్యవహారం మాది కాదని పేర్కొన్నారు. అప్రజాస్వామికంగా మాట్లాడిన బాలకృష్ణ తన మాటలు వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో మళ్లీ జగన్‌మెహన్‌రెడ్డిపై ఎటువంటి విమర్శలు చేసినా, అనుచితంగా మాట్లాడినా ఊరుకునే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న రమేష్, తదితరులు

బొబ్బిలి: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవికి హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని బొబ్బిలి పట్టణ చిరంజీవి అభిమానుల సంఘం అధ్యక్షుడు లంక రమేష్, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ బాలకృష్ణ విజ్ఞత మరచిపోయి అసెంబ్లీలో చిరంజీవిని ఉద్దేశించి వ్యంగంగా మాట్లాడారని, గతంలో కూడా బయట అనేక సార్లు మెగా కుటుంబాన్ని విమర్శించారన్నారు. అయినా చిరంజీవి ఎప్పుడూ ఎవరినీ విమర్శించలేదన్నారు. ఆయన అభిమానులుగా మేం కూడా సంయమనం పాటిస్తూ వచ్చామన్నారు. మెగా కుటుంబం అండగా లేకపోతే మీ పరిస్థితి ఎంత దిగజారిపోయేదో ఒక్కసారి ఊహించుకోవాలని హితవు పలికారు. మరోసారి ఇలా నోరు జారి మాట్లాడితే మెగా అభిమానుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని బాలకృష్ణను హెచ్చరించారు. వెంటనే ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే నిరసనలు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. పోలారావు, త్రినాథ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



రాజాం: ఆగూరులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సిద్ధీశ్వరి


వంగర: కె.కొత్తవలసలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రాజాం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆగూరు గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధీశ్వరి ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారితో పాటు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామస్తులకు వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కొత్తవలసలో..

వంగర: మండలంలోని కె.కొత్తవలసలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 73 మందికి ఎంఎల్‌హెచ్‌పీ ప్రసాద్, వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి బెడ్ రెస్ట్ రోగులకు వైద్య సేవలందించారు. సీహెచ్‌ఓ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర, తదితరులు

రాజాం సిటీ: గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు అన్నారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో స్థానిక యువత సహకారంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొనుగుటివలస గ్రామ యువకులను ఇతర గ్రామాల యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.యువత కలసికట్టుగా ఉన్నప్పుడే ఊరికోసం మంచిపనులు చేయడం సాధ్యమవుతుందని అన్నారు. యువకులు రెడ్డి శ్రీనివాసరావు, ఎస్.అప్పలనాయుడు, శాసపు శివకృష్ణ, రెడ్డి శేఖర్, లావేటి హరిబాబు, కెంబూరు లక్ష్మునాయుడు, శాసపు గణపతి, ఏ.రాజబాబు, ఎస్.చిన్నబాబు, ఆర్.సూర్యనారాయణ, ఎస్.దాము, మీసాల ఉపేంద్ర, మీసాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం


గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

రామభద్రపురం: పోషణ మహా ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-3లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు శనివారం సామూహిక సీమంతం చేశారు. అతిథులుగా హాజరైన తహసీల్దార్ అజు రఫీజాన్, పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. ఆకుకూరలు,కూరగాయలు, పండ్లు తీసుకోవడం వల్ల పోషకాహారం లోపం, రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. తల్లిపాలు బిడ్డలకు అమృత సమానమని, బిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా అందని వేతనాలు


టీఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

రాజాం సిటీ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదని, తక్షణమే వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఆర్పీలతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో టీఎంసీ రాజేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా నెట్టుకు రాగలరని ప్రశ్నించారు. ఆర్పీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దసరా పండగ పూట కూడా పస్తులుండాలా అని నిలదీశారు. మున్సిపాలిటీలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న వీరికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నా అమలు కాకపోవడం దురదృష్టమని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ధనలక్ష్మి, స్వాతి, వరలక్ష్మి, సత్యవతి, గౌరి, జానకి, దేవి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్...


మురుగునీరు బయటకు పోయేలా పనులు చేస్తున్న కార్మికులు

రేగిడి: మండల పరిధిలోని బుడితిపేట గ్రామ రజకవీధిలో మురుగు నీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. రజక వీధిలో మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'ఇళ్ల మధ్యే మురుగు' శీర్షికతో సాక్షిలో శనివారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎంపీడీఓ శ్యామలాకుమారి స్పందించి మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి వి.బిందు శేఖర్‌ను ఆదేశించారు. దీంతో సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, పంచాయతీ కార్యదర్శి కలిసి వీధిలో నిలిచిపోయిన మురుగునీరు బయటకు వెళ్లేలా ఏర్పాటుచేశారు. ఎంపీడీఓ మాట్లాడు తూ భవిష్యత్‌లో సమస్య లేకుండా కాలువ నిర్మాణం చేపట్టి మురుగునీరు ఆరుబయటకు పోయేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నాణ్యతతో పనులు చేయాలి

బొబ్బిలి: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని రాణి మల్లమ్మదేవి పార్కులో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. పనులను త్వరగాపూర్తి చేయాలని వర్కర్లకు సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన

బొబ్బిలిరూరల్: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా పారాది గ్రామంలో మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. మహిళలకు సోకే క్యాన్సర్ వ్యాధి రకాల గురించి పిరిడీ పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ్ వివరించారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని, అనుమానాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాలింతలు,గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఐసీడీఎస్ పీఓ, వైద్యాధికారి పరిశీలించారు. సర్పంచ్ నానేశ్వరి,మాజీ సర్పంచ్ అల్లాడ భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.సుబ్బులక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు


బొబ్బిలి:పాత బొబ్బిలిలో ఘటాలతో అమ్మవారి పూజకు తరలి వెళ్తున్న భక్తులు


వంగర: సంగాంలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గాదేవి ఆలయాలు, మంటపాల్లో అమ్మవారు శనివారం లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


బొబ్బిలి: బొబ్బిలి దాడితల్లి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు


బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో బాలా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


సంతకవిటి: మోదుగులపేటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


రేగిడి: అంబకండిలో పూజలు చేస్తున్న మహిళలు